క్లుప్తంగా

ఆర్థిక సాయం



మనుబోలు: కోదండరామాపురానికి చెందిన మహేష్‌కు వైద్యఖర్చుల నిమిత్తం శ్రీసేవ నాథం ట్రస్ట్ ఫౌండర్ శ్రీనాథ్‌రెడ్డి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. గత కొన్నిరోజులుగా మహేష్ అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనాథ్‌రెడ్డి ఆస్పత్రికెళ్లి రూ.10వేలు నగదు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని వరదరాజ స్వామి ఆలయ అటెండర్‌పై దాడికి యత్నించిన ఘటనలో టీడీపీ నాయకులపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు. వివరాలు.. జొన్నవాడలోని వరదరాజు స్వామి ఆలయంలో అధికారులు, పాలక మండలి అనుమతి లేకుండా స్థానిక టీడీపీ నాయకుడు ముంగర సుధాకర్, సర్పంచ్ కందికట్టు పెంచలయ్య వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా శిలాఫలకం వేసేందుకు యత్నించారు. ఆలయ అటెండర్ రమేష్ అనుమతులు లేకుండా శిలాఫలకం వేయడం తగదని అడ్డుకోగా టీడీపీ నాయకులు గొంతుపట్టుకుని తోసివేసి దాడికి యత్నించారు. ఈ విషయాన్ని రమేష్ ఆలయ ఈఓ వెంకటసుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లగా, బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా శ్రీవారికి పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లోని లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు.

రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ మృతి చెందారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. రంగనాయకులపేట గోపురంవీధికి చెందిన ఆటోడ్రైవర్ వెంకటేశ్వర్లు (66)కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఇంటి నుంచి బయటకొచ్చిన ఆయన రంగనాయకులపేట రైల్వే గేట్ సమీపంలో పట్టాలు దాటుతుండగా, గువాహటి ఎక్స్‌ప్రెస్ వేగంగా ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కాగా రైల్వే లోకో పైలట్ హారన్ కొట్టినా, వినికిడి లోపంతో వెంకటేశ్వర్లుకు వినిపించలేదని స్థానికులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): బ్యాంక్‌లో ఉద్యోగాన్ని ఇప్పిస్తానని నగదును తీసుకొని మోసగించిన నిందితుడిపై చిన్నబజార్ పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రేబాలకు చెందిన కార్తీక్ ఆర్టీసీలో ఏడీసీగా పనిచేస్తున్నారు. గతంలో ఒకటో డిపోలో కండక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో నెల్లూరు – మోడేగుంట సర్వీస్‌లో విధులు నిర్వర్తిస్తుండగా, వేగూరుకు చెందిన నాగేశ్వరరావుతో పరిచయం ఏర్పడింది. కార్తీక్ కుటుంబ వివరాలను నాగేశ్వరరావు సేకరించారు. తనకు ఎస్‌బీఐలో ఉన్నతాధికారులు తెలుసునని.. తిరుపతి లేదా చేజర్ల శాఖలో నీ కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని కార్తీక్‌ను నమ్మించి రూ.30 లక్షలను తీసుకున్నారు. నగదును తీసుకొని నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో కార్తీక్ నిలదీయగా కాలయాపన చేయసాగారు. దీంతో ఉద్యోగం పేరిట మోసగించిన నాగేశ్వరరావుపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేశారు. ఎస్సై లేఖా ప్రియాంక కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేన్సర్ హాస్పిటల్‌కు రూ.ఐదు లక్షల విరాళం

నెల్లూరు (అర్బన్): పొదలకూరు రోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ హాస్పిటల్లో నూతన భవన నిర్మాణానికి రూ.ఐదు లక్షల విరాళాన్ని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంగయ్యనాయుడు అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ చక్రధర్‌బాబుకు ఆయన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఇచ్చారు. రెడ్‌క్రాస్ కేన్సర్ హాస్పిటల్ నూతన భవనంలో ఓ గదికి తన తల్లిదండ్రులు రామచంద్రయ్య నాయుడు, రమణమ్మ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందజేశానని చెప్పారు. కేన్సర్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, సామాజిక కార్యకర్త సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు ఘనత వైఎస్ జగన్‌దే

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



గురువిందపూడిలో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: ఎన్నికల హామీలను సమర్థవంతంగా అమలు చేసిన ఘనత రాష్ట్ర చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గురువిందపూడిలో శనివారం ఆయన పర్యటించారు. తొలుత గ్రామంలో రూ.79.30లక్షలతో నిర్మించతలపెట్టిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ భవనాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. గ్రామంలోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. గత ప్రభుత్వంలో కొందరికే సంక్షేమ పథకాలు అందిస్తే, తాము అర్హులందరికీ అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

చంద్రబాబు భ్రమల్లో బతకొద్దు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాల్లో గెలవడంతో చంద్రబాబు భ్రమల్లో ఉంటూ చంకలు గుద్దుకుంటున్నాడని మంత్రి కాకాణి అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవగానే టీడీపీ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు టపాసులు కాల్చుకుంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సీఎం వైఎస్ జగన్ జనరంజక పాలనతో అన్నీ వర్గాల ప్రజలు రాబోయే ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చంద్రబాబు చేసిన గత మోసాలను ఇప్పటికీ ప్రజలు మర్చిపోలేకున్నారని, ఓటుతో మళ్లీ బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోయి రోడ్డెక్కాలని చంద్రబాబు కోరుకున్నాడని, కానీ ప్రస్తుతం ఉన్న ధరలతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటుందన్నారు.

షోకాజ్ నోటీసు ఇవ్వకుండానే సస్పెండ్ చేయొచ్చు

పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసిన వారికి షోకాజ్ నోటీసు ఇవ్వకుండానే సస్పెండ్ చేయొచ్చునని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఎమ్మెల్యేల సస్పెన్షన్‌పై విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసులు ఇచ్చే అంశం రాజ్యాంగ పరమైనదికాదని, పార్టీ నిర్ణయానికి సంబంధించిన విషయమన్నారు. బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో ఎక్కడా పార్టీల ప్రస్తావన తేలేదని, ఒక పార్టీలో గెలిచి మరొక పార్టీకి ఓటు వేస్తారని ఆయన ఊహించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సర్పంచ్ సమత, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నెమాల సుధీర్‌రెడ్డి, చేవూరు ఓసూరయ్య, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



దంపూరులో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు (విడవలూరు): రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలం రామతీర్థంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు..సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా సీసీరోడ్లు నిర్మించాలని మహిళలు కోరగా సచివాలయాలకు కేటాయించే అభివృద్ధి నిధులతో రెండు సీసీరోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అందుకు రూ.4.5 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వేల్పుల నారాయణమ్మ భర్త చనిపోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటి వరకు కోవూరు నియోజకవర్గంలోని 52 సచివాల పరిధిలో 57,379 గడపలు తిరిగామన్నారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ పథకాలను చేరవేస్తోందని తెలిపారు. గ్రామానికి చెందిన అన్నం రవీంద్ర కుటుంబం వివిధ పథకాల ద్వారా అత్యధికంగా రూ.8.16 లక్షలు, మరో కుటుంబం రూ.6 లక్షల మేర లబ్ధి పొందాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనకు వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు అసత్యప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నాయన్నారు. ప్రజలు మోసపోకుండా రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు.



వృద్ధురాలికి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

దంపూరులో సీసీరోడ్డు ప్రారంభం

దంపూరు మిక్స్‌డ్ కాలనీలో సచివాలయ అభివృద్ధి నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభించారు. కోవూరు నియోజకవర్గంలోనే తొలిసారిగా దంపూరులో సచివాలయ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, ఆప్కాప్ రాష్ట్ర చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్లు అచ్యుత్‌రెడ్డి, భానురెడ్డి, ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ లక్ష్మయ్య, నాయకులు ఆవుల వాసు, కరుణాకర్, వెంకటసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, రమణయ్య, భాస్కర్, సర్పంచ్ సుజన, చంద్రయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పొదలకూరు: ఎర్త్‌అవర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ముత్తుకూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పొదలకూరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కే సనత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు, నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు ఎర్త్‌అవర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు ఎర్త్‌అవర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో విద్యుత్ సరఫరా నిలిపివేసి పర్యావరణాన్ని కాపాడడంతో పాటు విద్యుత్‌ను పొదుపు చేసి బావి తరాలకు అందించాలని కోరారు. అనంతరం సీవీరామన్ సైన్స్‌క్లబ్ విద్యార్థులతో ఎర్త్‌అవర్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్త్‌అవర్‌ను విజయవంతం చేయాలి

ముత్తుకూరు: పర్యావరణ పరిరక్షణ కోసం తలపెట్టిన 'ఎర్త్‌అవర్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ముత్తుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చెంచురామయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం ముత్తుకూరులో ఎర్త్‌అవర్‌పై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 గంటల మధ్యన గంటపాటు తమ ఇళ్లలోని విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని కోరారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల గ్రంథాలయానికి రూ 5వేల విలువైన పుస్తకాలు, రూ.5వేల విలువైన ఫ్యాన్లు బహూకరించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధి బసవరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ టీ నగేష్‌కుమారి శనివారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు శ్రీకృష్ణమందిరం నిర్మాణానికి నిర్వహించే భూమి పూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఒకరు గైర్హాజరు

వెంకటాచలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో శనివారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు ఒక్క విద్యార్థి గైర్హాజరయ్యాడు. వెంకటాచలం, మనుబోలు మండలాలకు సంబంధించి మొత్తం 327 మంది విద్యార్థులకుగానూ 326 మంది పరీక్షలకు హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



బుచ్చిరెడ్డిపాళెం: రేబాలలోని పీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సరస్వతి పూజ వైభవంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను ప్రసాదించాలని సరస్వతిదేవిని వేడుకున్నారు. హెచ్‌ఎం ఫణీంద్ర, కోఆప్షన్ సభ్యుడు మస్తానయ్య, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, నాయకులు ఆరుగుంట హరిప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు మనుబోలు విద్యార్థిని



మనుబోలు: 2021–22 సంవత్సరానికి సంబంధించి జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు మనుబోలు బాలికోన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మి ఎంపికైంది. రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలను కాకినాడలో నిర్వహించగా ఆన్‌లైన్ ద్వారా జిల్లా నుంచి మూడు అత్యుత్తమ నమూనాలను ఎంపిక చేశారు. అందులో లక్ష్మి ప్రదర్శించిన యాక్సిడెంట్ ప్రివెంట్ డివైజర్ ప్రాజెక్ట్‌ను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో లక్ష్మిని హెచ్‌ఎం వసంతకుమారి, గైడ్ టీచర్లు సువర్ణ, పద్మ, తదితరులు శనివారం అభినందించారు.

రూ.80 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం



సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

పొదలకూరు : పొదలకూరు పంచాయతీ పరిధిలో రూ.80 లక్షల అంచనాలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఇటీవల నాలుగు సచివాలయాల పరిధిలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సమయంలో సిమెంట్‌రోడ్ల అవసరాన్ని గుర్తించిన మంత్రి రూ.80 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఎమ్మార్వో కాలనీ, లింగంపల్లి ఎస్సీకాలనీ, తోకంచిలో ముందుగా సిమెంట్‌రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మిగిలిన చోట్ల త్వరలో పనులను మొదలు పెట్టడం జరుగుతుందని పీఆర్ ఏఈ ప్రసాద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, బిట్–4 ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు, నాయకులు డీ విజయభాస్కర్‌రెడ్డి, అనమాల రమణారెడ్డి, ఎం శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ట్రాక్టర్ పరికరాల పంపిణీ



సీహెచ్‌సీలకు ట్రాక్టర్ పరికరాలు అందజేస్తున్న దృశ్యం

కొడవలూరు: మండలంలోని తలమంచి, కొడవలూరు ఆర్‌బీకేల పరిధిలోని కమ్యూనిటి హైరింగ్ సెంటర్లకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై ట్రాక్టర్ పరికరాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ లక్ష్మి మాట్లాడుతూ ఆర్‌బీకేల పరిధిలోని సీహెచ్‌సీ గ్రూపులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తోందని తెలిపారు. మండలంలో 16 ఆర్‌బీకేలు ఉండగా, 11 ఆర్‌బీకేల పరిధిలోని సీహెచ్‌సీలు యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నాయని తెలిపారు. వ్యవసాయ పరికరాలకు 40 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుండగా, 50 శాతం సహకార బ్యాంక్ రుణం ఇస్తుందన్నారు. సీహెచ్‌సీ వాటాగా కేవలం 10 శాతం నగదు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. సహకార బ్యాంక్ కోవూరు శాఖ మేనేజర్ సుధాకర్, ఫీల్డ్‌ఆఫీసర్ రాఘవ, వీఏఏలు ప్రసాద్, కవిత, సీహెచ్‌సీల సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిని సత్యవాణి

కొడవలూరు: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి పీ సత్యవాణి సూచించారు. కొడవలూరులోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను శనివారం ఆమె పరిశీలించారు. గృహ నిర్మాణాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గృహ లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నా పనుల్లో జాప్యంపై ఆరాతీశారు. ఉగాది నాటికే నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉన్నా, ఇంకా నిర్మాణాలను పూర్తి చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. చిన్నపాటి పనులు మిగిలి ఉన్న గృహాలను వారంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. తొలుత మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజూ గృహ నిర్మాణాలకు సంబంధించి ఒక్క బిల్లు అయినా పెట్టాలన్నారు. మూడ్రోజులపాటు ఎలాంటి బిల్లులు పెట్టని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. హౌసింగ్ ఏఈ పీ సురేష్‌కుమార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ జానీ, డేటా ఎంట్రీ ఆపరేటర్ సునీత పాల్గొన్నారు.

మూగప్రేమ



ఓ గోమాత తన మూగప్రేమను చాటుకుంది. ఆకలితో తన వద్దకొచ్చిన గొర్రె పిల్లకు పాలిచ్చి అమ్మప్రేమను పంచింది. ఈ దృశ్యం విడవలూరు మండలం రామతీర్థంలో కనిపించింది.
–కోవూరు(విడవలూరు)

రైతుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి

కోవూరు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పడుగుపాడు సొసైటీ పనిచేస్తోందని ఆ సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని సొసైటీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు సొసైటీ ద్వారా స్వల్పకాలిక రుణాలు 174 మందికి రూ.10.74 కోట్లు, ఎస్‌ఏవో పథకం కింద 346 మందికి రూ.3.20 కోట్లు, గృహ రుణాల కింద నలుగురికి రూ.25లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. సొసైటీ ప్రాంగణంలోని బ్యాంకు ద్వారా 175 మందికి రూ.3.50 కోట్ల మేర బంగారు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. సొసైటీ ప్రాంగణంలో రైతుల కోసం 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదామును రూ.24 లక్షలతో నిర్మిస్తున్నామని వివరించారు. త్వరలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నెల 30న పడుగుపాడు సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తదాతలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి , సభ్యులు అంబటి ప్రసాద్, గున్నం జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఇందుకూరుపేట: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుబ్బరత్న



కోవూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమణి

ఇందుకూరుపేట: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్ సుబ్బరత్న కోరారు. ఇందుకూరుపేట ఎస్టీ, నార్త్ కుమ్మరివీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. చిరుధాన్యాల్లోని పోషక విలువలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకుని తల్లీబిడ్డ సంరక్షణే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రాధ, హేమవతి, తదితరులు పాల్గొన్నారు.

కోవూరు(విడవలూరు): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకుని పోషక విలువలు పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి కోరారు. విడవలూరు మండలం గౌరీపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నరసమ్మ, భారతి, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'కిల్కారి'తో గర్భిణులకు సూచనలు



25కేవీఆర్42-ఏఎన్‌ఎంలు, ఆశలకు సూచనలు ఇస్తున్న డీపీహెచ్‌ఎన్‌ఓ మంజుల

కొడవలూరు: 'కిల్కారి' మొబైల్ హెల్త్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం ద్వారా ప్రతీ గర్భిణికి ఫోన్ ద్వారా ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు అందించాలని జిల్లా ప్రోగ్రాం హెల్త్ నోడల్ ఆఫీసర్(డీపీహెచ్‌ఎన్‌ఓ) మంజుల సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కొడవలూరు, యల్లాయపాళెం, విడవలూరు పీహెచ్‌సీల ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు 'కిల్కారి' ప్రోగ్రాం, 'ఈ–ఆశ' యాప్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫోన్ ద్వారా అందించే బృహత్తర కార్యక్రమం కిల్కారి అని తెలిపారు. ఇందులో వైద్య సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఆశ కార్యకర్తలకు వైద్యశాఖ ఫోన్ అందించడంతో పాటు 'ఈ–ఆశ' యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ యాప్‌లో గర్భిణులు, బాలింతలు, పిల్లల సమగ్ర వివరాలు పొందుపరచాలని సూచించారు. యాప్‌లో ఏ ఒక్కరి వివరాలు నమోదవకపోయినా ఆశలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం రామకృష్ణ, డీసీసీఎం సునీత, హెచ్‌ఎస్‌లు పద్మ, వసంత, సీహెచ్‌ఎస్ విజయకుమారి పాల్గొన్నారు.

వేడుకగా కొఠాయి మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో రాములవారి వార్షిక కొఠాయి మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనివాస అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారావు, రామచంద్రరావు, బాలాజీ, ఈఓ హేమచంద్రరావు పర్యవేక్షించారు.